ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు

సోమవారం 2 డిసెంబరు 2024 | 5





సామర్లకోట భీమేశ్వరుడికి అఖండకోటి దీపారాధన

కార్తీకమాస పూజల ముగింపు సందర్భంగా సామర్లకోట భీమేశ్వరునికి అఖండ కోటి దీపారాధనలో భాగంగా దీపాలు వెలిగిస్తున్న భక్తులు

7



విశ్వేశ్వరస్వామికి.. మహాకుంభాభిషేక మహోత్సవం

కత్తిపూడిలో విశ్వేశ్వరస్వామివారి మహాకుంభాభిషేక మహోత్సవం సందర్భంగా సప్తనదీ జలాలతో వేలాదిగా తరలివస్తున్న భక్తులు

7



సాగరతీరంలో.. మహాకుంభాభిషేకం

కాకినాడ సాగరతీరంలోని ఆదికుంభేశ్వరుడి ఆలయం వద్ద కోటి8లక్షల శివలింగాలకు 49వ మహాకుంభాభిషేకం ఘనంగా నిర్వహించగా అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

కష్టం.. వాన పాలు!





- మళ్లీ తడిచిన ధాన్యం రాశులు
- గాలులకు నేలకొరిగిన వరి పంట
- పొలాల్లో నిలిచిపోతున్న నీరు
- వరికుప్పల్లోకి నీరు..
- రక్షణ చర్యలు చేపడుతున్న రైతులు
- వరికుంకులు మొలకెత్తే ప్రమాదముందని ఆందోళన



గొల్లప్రోలులో ఆరబెట్టిన ధాన్యం రాశులు.. ఇన్‌సెట్‌లో తడిచిన ధాన్యం

తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షంతో ధాన్యం రాశులు తడిచాయి. ఉదయం ఎండ పొడ వస్తుందని భావించి ఆరబెట్టుకునే లోపుగానే మళ్లీ వర్షం పడింది. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నేలనంటింది. పలుచోట్ల కుప్పల్లోకి నీరు వెళ్లకుండా రైతులు రక్షణ చర్యలు చేపట్టారు. సార్వా పంట చేతికందే సమయంలో వెన్నాడే ప్రకృతి వైపరీత్యాలు ఏటా మాదిరిగానే ఈ ఏడాది రైతులను కలవరానికి గురిచేస్తున్నాయి.

పిఠాపురం/గొల్లప్రోలు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకూ, ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో ధాన్యం రాశులు తడిచిపోయాయి. ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకుగాను రైతులు ప్రయత్నిస్తుండగానే వర్షపు చినుకులు పడడంతో రాశులు తడవకుండా బరఖాలు, టార్పాలిన్లు కప్పారు. పలుచోట్ల కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నేలకొరిగింది. నేలనంటిన వరిపంటపై వర్షం కురిసింది. దీనితో వరికంకులు మొలకెత్తే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

60శాతం కోతలు పూర్తి

ఏలేరు, పీబీసీ ఆయకట్టుతోపాటు మెట్టప్రాంతాల్లో ఆదివారం నాటికి 60శాతం విస్తీర్ణంలో వరి కోతలు, మాసూళ్లు(నూర్పిళ్లు) పూర్తయ్యాయి. మాసూళ్లు పూర్తయిన ప్రాంతాల్లో పలుచోట్ల ధాన్యం రాశులు పొలాలు, కళ్లాల్లో ఉండిపోయాయి. కొన్నిచోట్ల రహదారుల వెంబడి రాశులుగా పోసి ఉంచారు. మిగిలిన 40శాతం విస్తీర్ణంలో వరి పంట కోతకు సిద్ధంగాఉంది. కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట గాలులు, వర్షం ప్రభావానికి నేలకొరిగింది. శని,ఆదివారాల్లో కురిసిన వర్షంతో పొలాల్లో నేలనంటిన వరిపంటపై వర్షం కురిసి నీరు నిలిచింది. దీంతో అక్కడక్కడా వరికంకులు నీటిలో నానుతున్నాయి. నేలకొరిగిన వరిపంట నుంచి ధాన్యం రాలిపోతుందని, దీంతో దిగుబడులు తగ్గుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సామర్లకోటలో బరకాల కింద ధాన్యం రాశులు

తడిచిన పంట

పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల శివారు ప్రాంతాలతోపాటు పిఠాపురం-సామర్లకోట రోడ్డు, చిత్రాడ నుంచి కత్తిపూడి వరకూ ఉన్న జాతీయ రహదారి వెంబడి, ఖాళీ స్థలాలు, లేఅవుట్లు, కళ్లాల్లో ధాన్యాన్ని రాశులుగా పోశారు. వరికోత యంత్రాల సహాయంతో మాసూళ్లు పూర్తి చేయడంతో తేమశాతాన్ని తగ్గించేందుకు ధాన్యాన్ని ఆరబెట్టే ఉద్దేశ్యంతో ధాన్యాన్ని రాశులుగా ఉంచారు. వర్షంతో పలుచోట్ల ధాన్యం తడిచింది. తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు ప్రయత్నించినా ఆదివారం కురిసిన వర్షంతో మళ్లీ రాశులుగా ఉంచి తడవకుండా టార్పాలిన్లు కప్పివేశారు. కుప్పల్లోకి నీరు వెళ్లకుండా రైతులు రక్షణ చర్యలు చేపట్టారు. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో 17,477 హెక్టార్లల్లో సార్వా వరిని సాగు చేయగా ఆదివారం నాటికి 10,047హెక్టార్లల్లో వరికోతలు, మాసూళ్లు పూర్తయ్యాయి. గొల్లప్రోలు మండలంలో 2350 హెక్టార్లు, పిఠాపురం మండలంలో 3040, కొత్తపల్లి మండలంలోని 2045 హెక్టార్లలోని వరి పంట కోతలు, మాసూళ్లు ఇంకా జరగాల్సి ఉంది. వర్షం తగ్గేవరకూ వేచి చూసే ధోరణిలో ఉన్నా గాలులు, వర్షానికి పంట పడిపోవడంతో వారిని కలవరానికి గురిచేస్తోంది.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

-పి.స్వాతి, వ్యవసాయశాఖ అధికారి, పిఠాపురం

తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు ధాన్యం రాశులు, కుప్పలు తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. నూర్పిన ధాన్యం రెండు, మూడు రోజులు ఆరబెట్టడానికి సాధ్యం కాకుంటే మొలకెత్తే లేదా రంగుమారే ప్రమాదముంది. ఈ పరిస్థితుల్లో క్వింటాల్ ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20కిలోల పొడి ఊక కలిపి ధాన్యాన్ని పోగుగా పెట్టడంవల్ల గింజ మొలకెత్తకుండా, చెడు వాసన రాకుండా కాపాడుకోవచ్చు. వర్షాలు తగ్గి ఎండ కాసే వరకూ కోతలు, మాసూళ్లు నిర్వహించవద్దు. సూచనల కోసం వ్యవసాయాధికారులను సంప్రదించాలి.

తుఫాన్ నేపథ్యంలో వరిపంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- జిల్లా వ్యవసాయాధికారి సూచనలు

సామర్లకోట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను కారణంగా అధిక వర్షాల నేపథ్యంలో వరి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్ వివరించారు. క్షేత్రస్థాయిలో పంటలను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న అవస్థలను జిల్లా వ్యవసాయాధికారి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సామర్లకోట ఏడీబీ రోడ్డులోని ధాన్యం రాశుల వద్ద ఆయన మాట్లాడుతూ ఈ విధంగా సూచనలు చేశారు.

- కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటను ప్రస్తుత సమయంలో కోయరాదు. కోసినా ఆరని వరి పనలను తుపాను వాతావరణ నేపథ్యంలో కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25కిలోల ఉప్పును పనలపై చల్లుకోవడం ద్వారా నష్టాన్ని నివారించవచ్చు.
- కోతకోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిస్తే గింజ మొలకెత్తకుండా ఉండేందుకు 5శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేయాలి.
- పొలంలో నీరు నిలిచి ఉంటే వరిపనలను గట్టుపైకి తెచ్చి పనలను విడగొట్టి ఉప్పు ద్రావణాన్ని జల్లుకోవాలి.
- వర్షాలు తగ్గి ఎండలు రాగానే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలి. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని తడవకుండా భద్రపరుచుకోవాలి.
- నూర్చిన ధాన్యం 2-3 రోజులు ఎండబెట్టడానికి వీలు లేకపోతే గింజ మొలకెత్తడమే గాక రంగుమారి చెడువాసన వస్తుంది. ఈ పరిస్థితుల్లో ఒక క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెట్టడంవల్ల గింజ మొలకెత్తకుండా, చెడిపోకుండా నివారించుకోవచ్చు.

సత్యదేవుడి సన్నిధిలో ముగిసిన కార్తీక సందడి

- 1,47,122 వ్రతాలతో ఆల్ టైం రికార్డు
- 'కార్తీకం'లో రూ.20కోట్ల ఆదాయం అంచనా
- నేడు హుండీల లెక్కింపు

7

హెచ్ఐవీ బాధితుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలి

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



హెచ్ఐవీ బాధిత బాలలతో సహపంక్తి భోజనంలో పాల్గొన్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపడం ద్వారా వారికి భరోసా కల్పించవచ్చని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి నివారణకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపడుతోందన్నారు. వ్యాధిగ్రస్తులైన చిన్నారులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం ద్వారా వాళ్లలో ఆత్మవిశ్వాసం, భరోసా ఏర్పడుతుందన్నారు. మనచుట్టూ ఉన్న సమాజాన్ని బలోపేతం చేయాలంటే ఇటువంటి కార్యక్రమాలు స్వచ్ఛందంగా చేపట్టాలన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంనుంచి పీఆర్ కళాశాల మీదుగా బాలాజీ చెరువు సెంటర్ వరకు ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో నరసింహనాయక్ మాట్లాడుతూ ఎయిడ్స్‌పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగస్తులకు, వివిధ స్వచ్ఛంద సంస్థలకు కలెక్టర్ షాన్‌మోహన్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జేసీ రాహుల్ మీనా, జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి రమేష్, డీసీహెచ్ఎస్ స్వప్న, జీజీహెచ్ ఇన్‌చార్జీ సూపరింటెండెంట్ విఠల్‌రావు, ఓఎస్టీసీ సంస్థ సునీల్‌కుమార్, రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ వైడీ రామారావు, సెట్‌రాజ్ సీఈవో కాశీ విశ్వేశ్వరరావు, రిలయన్స్ సంస్థ డీజీఎం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేస్తున్న రిలయన్స్ సంస్థ డీజీఎంకు ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార నిమిత్తం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కాకినాడ కలెక్టరేట్‌లో జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

ఉప్పాడ తీరంలో అలల ఉధృతి

7



కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్‌రోడ్డులో ఉధృతంగా ఎగసిపడుతున్న కెరటాలు

భారీ వర్షం

- రహదారులు జలమయం
- పొంగిపొర్లిన డ్రైన్లు
- వనభోజనాలకు ఇబ్బంది

జిల్లావ్యాప్తంగా ఆదివారం భారీవర్షం కురిసింది. తుపాను ప్రభావంతో గాలులు వీచాయి. వర్షం కారణంగా రహదారులు జలమయం కాగా.. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. పిఠాపురం, గొల్లప్రోలు, ప్రత్తిపాడు, సామర్లకోట, తుని, జగ్గంపేట, కాకినాడ, కరప, తాళ్లరేవు, గండేపల్లిల్లో వర్షం కురిసింది.

పిఠాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం స్వల్పంగా ఎండ కాయగా తదనంతరం ఆకాశం మేఘావృతమైంది. మధ్యాహ్నం 12 గంటలకు వర్షం ప్రారంభమై 2.45గంటల వరకూ కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల డ్రెయిన్లు పొంగిపొర్లి రోడ్ల మీదకు నీరు చేరింది. ఆదివారం సెలవు కావడం, వర్షంతో రహదారులు నిర్మానుష్యంగా మారాయి. కార్తీకమాసం సందర్భంగా ఏర్పాటు చేసుకున్న వనభోజనాలకు వర్షం ఇబ్బంది కలిగించింది.



పిఠాపురంలో కురుస్తున్న వర్షం

కొత్తపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ తీరం దాటడంతో తీరప్రాంత గ్రామాల్లో ఆదివారం కురిసిన చిరుజల్లులతో రోడ్లు, వీధులు బురదగా మారాయి. కోతమిషన్ల మటి కారణంగా చినుకులతో చిత్తడిగా మారాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో.. తగ్గిన ప్రవేశాలు



- గత ప్రభుత్వ విధానాలతో ప్రాథమిక విద్యలో గందరగోళ పరిస్థితులు
- 3,4,5 తరగతుల విలీన ప్రక్రియతో విద్యార్థుల దూరం

కాకినాడ రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను చాలా ఉన్నత స్థితికి తీసుకెళ్లామని, ఆంగ్లమాధ్యమంలో బోధన అందించామని, విద్యాకానుక, అమ్మఒడి వంటి వాటి ద్వారా తమ కృషితో ప్రభుత్వ పాఠశాలలు ఎంతో అభివృద్ధి చెందాయని గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటం చేసింది. కానీ క్షేత్రస్థాయి పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. దానికి నిదర్శనమే ఈఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య గణనీయంగా పడిపోయింది. గత ఐదేళ్లలో వైసీపీ అసమర్థ పాలన కారణంగానే ఈ దుస్థితి ఏర్పడింది. వాస్తవానికి ఈ ఏడాది జూన్ నుంచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ అంతకుముందు ప్రభుత్వ నిర్ణయాల వల్లే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

- కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లో 1 నుంచి 10వ తరగతి వరకూ మొత్తం 1874 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 2023-24 విద్యాసంవత్సరంలో 2,98,000మంది విద్యార్థులుండగా 2024-25 విద్యాసంవత్సరంలో 2,96,000మంది మాత్రమే ఉన్నారు. విద్యార్థుల ప్రవేశాలు పెరగాల్సి ఉండగా గతప్రభుత్వ విధానాల కారణంగా ప్రవేశాలు తగ్గడం విశేషం.

ఉదాహరణలివిగో..

- కాకినాడ రూరల్ మండలం కొవ్వాడ ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో 410మంది విద్యార్థులుండగా ఈఏడాది 356 మంది మాత్రమే ఉన్నారు. ఇంద్రపాలెం ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో 503 మంది విద్యార్థులుండగా ఈ ఏడాది 455మంది మాత్రమే ఉన్నారు. తూరంగి ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో 752మంది విద్యార్థులుండగా ఈఏడాది 640 మంది మాత్రమే ఉన్నారు. కాకినాడ సాలిపేటలోని బాలికల ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో 1300 మంది విద్యార్థులుండగా ఈ ఏడాది 2024-25 విద్యా సంవత్సరంలో 1145మంది మాత్రమే ఉన్నారు.

● ఆ స్థాయిలో ప్రవేశాలేవీ?

కాకినాడ జిల్లాలో గతేడాదితో పోలిస్తే ప్రస్తుత విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య తగ్గింది. ప్రతిఏటా 27వేల మందికిపైగా విద్యార్థులు పదో తరగతి పూర్తిచేసి బయటకు వెళ్లిపోతున్నారు. కానీ ఆ స్థాయిలో మాత్రం ఒకటో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు లేవు.

● జీవో 117తో అస్తవ్యస్త నిర్ణయాలు

గత ప్రభుత్వం జీవో 117తో అస్తవ్యస్త నిర్ణయాల కారణంగా ప్రభుత్వం పాఠశాలల్లో హేతుబద్ధీకరణ చేపట్టింది. ఆజీవోను అమలు చేస్తే ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ బడులుగా మారతాయని ఉపాధ్యాయులు గగ్గోలు పెట్టినా పట్టించుకోలేదు. ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, వ్యాయామోపాధ్యాయుల సంఖ్య తగ్గుతుందని హెచ్చరించినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రవేశాలు బాగా తగ్గాయి.

● విలీన ప్రక్రియతో దూరం..

జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా పాఠశాలలను విలీనం చేస్తున్నామని గత వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. గతంలో ప్రాథమిక పాఠశాలల్లో 1నుంచి 5వ తరగతి వరకూ తరగతులుండేవి. విద్యార్థులకు పదేళ్లు వచ్చే వరకూ ఒకే చోట చదువుకునేవారు. కానీ 3వ తరగతిలో సబ్జెక్టు ఉపాధ్యాయులతో బోధనంటూ చేసిన సంస్కరణలు ప్రాథమిక విద్యను దెబ్బతీశాయి. అప్పట్లో 3, 4, 5 తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. దీనివల్ల ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులు కిలోమీటరు దూరంలోని పాఠశాలలకు వెళ్లాల్సి వచ్చింది. అప్పట్లో ఈ సంస్కరణలను నిరసిస్తూ తల్లిదండ్రులు, విద్యార్థులు రోడ్డెక్కినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. దీని ఫలితంగా 1, 2 తరగతుల్లో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలోనే తగ్గిపోయారు. దీంతో ప్రవేశాలు తగ్గడం, పాఠశాలలు మూసివేతతో చాలామంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల బాటపట్టారు.

వెరీ..గుడ్డు



కోడి గుడ్డు అధరహో

ఫారం వద్ద గుడ్డు రూ.6.08 పైసలు

రిటైల్‌గా రూ.7లకు విక్రయం

అనపర్తి/సామర్లకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దాణా రేట్లు, నిర్వహణా ఖర్చులు గణనీయంగా పెరగడంతో రెండేళ్లుగా కోళ్ల పరిశ్రమ నష్టాల్లో నడిచింది. ప్రస్తుతం గుడ్డు ధర రూ.6.08 పైసలకు పెరగడంతో రైతులు కొంత మేర ఊపిరి పీల్చుకుంటున్నారు. 15 నుంచి 20 రోజులుగా ఈ ధర అటు ఇటుగా ఉన్నప్పటికీ రైతుకు కొంత మేర ప్రయోజనం చేకూరుతోంది. గోదావరి జిల్లాల్లో పెద్ద చిన్న ఫారాలు సుమారుగా 300నుంచి 350 వరకు ఉన్నాయి. వీటిలో సుమారుగా 1.5 కోట్ల కోళ్లు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు సుమారు 1 కోటి వరకు ఉత్పత్తి అవుతుండగా వీటిలో 40 శాతం వరకు స్థానిక అవసరాలకు వినియోగిస్తుండగా మిగిలిన వాటిని విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. నెక్ ధర రూ.6.08పైసలు ఉన్నప్పటికీ ట్రేడర్లు మాత్రం ఈ ధరకు రూ.0.25 పైసలు తగ్గించి కొంటున్నారు. మరో 2శాతం కమిషన్ రూపంలో పోవడంతో రైతుకు 5.80పైసలు మాత్రమే అందుతుంది. అయితే పేపర్ రేటు ఎక్కు వగా ఉండడంతో రిటైల్ మార్కెట్‌లో వినియోగదారుడు మాత్రం రూ.7 వెచ్చించి గుడ్డును కొనుగోలు చేస్తున్నాడు. అయితే దేశం మొత్తం పంజాబ్ మార్కెట్‌పై ఆధారపడి ఉంటుందని, అక్కడ ధర ఉన్నంత వరకే ఇక్కడ ధర ఉంటుందని, ఎన్ని రోజుల పాటు ఈ ధర నిలబడుతుంతో చెప్పలేమని రైతులు చెబుతున్నారు. రెండు మూడేళ్లలో బ్యా చ్‌ల సంఖ్య గణనీయంగా తగ్గించడంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఉత్పత్తి కూడా తగ్గు ముఖం పట్టింది. గుడ్డు తయారీకి సుమారుగా రూ.5 వరకు ఖర్చు అవుతుందని, అయితే ఏడాదిలో కనీసం రెండు మూడు నెలలు కూడా గిట్టుబాటు ధర ఉండడం లేదని, మిగిలిని తొమ్మిది మాసాల్లో నష్టాలు చవి చూస్తున్నామని రైతులు అంటున్నారు. దీనికి తోడు నూకలు, మొక్కజొన్నలు దొరడంలేదని, దొరికినా కొనలేని స్థితిలో ఉన్నామని వాపోతున్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉండగా రైతులకు అనేక రాయితీలు అందేవని, ఐదేళ్లుగా వైసీపీ పాలనలో ఒక్క రాయితీ కూడా లేకుండా చేశారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కనీసం నూకలు, మొక్కజొన్న రాయితీ ధరకు అందిస్తే పరిశ్రమ మనుగడ సాగిస్తుందని రైతులు కోరుతున్నారు.

సత్యదేవుడి వ్రతాలు 1,47,122

● ఆల్ టైమ్ రికార్డు ● ముగిసిన కార్తీక సందడి ● నేడు హుండీల లెక్కింపు ● రూ.20 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా



ఆలయంలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హరిహరులకు ప్రీతికరమైన పవిత్ర కార్తీకమాసం సందడి హరిహర క్షేత్రమైన సత్యదేవుడి ఆలయంలో ఆదివారంతో ముగిసింది. కార్తీకమాసం నెలరోజుల్లో ప్రతీఏటా 15 రోజులు పర్వదినాలు మిగిలిన 15రోజులు సాధారణ రోజులుగా ఉండేవి. ఈ ఏడాది మాత్రం కార్తీకమాసం ప్రారంభం నుంచి రద్దీ నాలుగైదు రోజులు మినహా ఒకే విధంగా సాగింది. దీంతో మునుపెన్నడూ లేని విధంగా వ్రతాల సంఖ్య ఆల్ టైం రికార్డు నెలకొల్పి 1,47,122 వ్రతాలు జరిగాయి. వీటిలో రూ.300 వ్రతాలు 1,6,901, రూ.1000 వ్రతాలు 17,714, రూ.1500 వ్రతాలు 10,269, రూ.2000 వ్రతాలు 12,238 జరిగాయి. ఈ ఏడాది కార్తీకమాసంలో భక్తులు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అలయ అధికారులు చర్యలు తీసుకోవడంతో త్వరితగతిన వ్రతాలు, దర్శనాలు పూర్తిచేసుకోగలిగారు. ప్రధానంగా ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు కలగనివ్వలేదు. గిరి ప్రదక్షిణ మధ్యాహ్నం సత్యరథంతో ప్రారంభించడం సత్ఫలితాలు ఇచ్చింది. పడమట రాజగోపురం వద్ద కంపార్టమెంట్లు ఏర్పాటు, క్యూలైన్‌లు పొడిగించడంతో సాధ్యమైంది. ఈ ఏడాది కార్తీకమాసంలో అన్ని విభాగాల ద్వారా సుమారు రూ.20 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. సోమవారం జరిగే హుండీల లెక్కింపుతో లెక్కతేలిపోనుంది. ఒక్క వ్రతాల ద్వారా సుమారు రూ.8కోట్లు ఆదాయం రావొచ్చని అంచనా. కౌంటర్లలో 143708 వ్రతం టిక్కెట్లు విక్రయించగా ఆన్‌లైన్ ద్వారా 3414 టిక్కెట్లను భక్తులు బుకింగ్ చేసుకున్నారు. వ్రత పురోహితులు, సిబ్బంది సముష్టిగా కృషి చేశారు.

మంత్రి సుభాష్ పూజలు

రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధిలో ఆదివారం మంత్రి వాసంశెట్టి సుభాష్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రోటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.



సత్యదేవుని దర్శనానంతరం మంత్రి సుభాష్

విఘ్నేశ్వరస్వామి ఆదాయం రూ.83.77 లక్షలు



అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి

అయినవిల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారి దేవస్థానం పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకుని గతేడాది కంటే అధిక ఆదాయం పొందినట్టు ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆదివారం తెలిపారు. గత నెల 2వ తేదీ నుంచి డిసెంబరు 1 వరకు సిద్ధివినాయస్వామివారిని 2.76లక్షల మంది భక్తులు దర్శించుకున్నారని, 1.26లక్షల మంది అన్నప్రసాదం స్వీకరించారన్నారు. గతేడాది రూ.46,13,318 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.83,77,303 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. గత కార్తీకమాసానికంటే అదనంగా రూ.37,63,985 అధిక ఆదాయం లభించిందన్నారు. అమలాపురం పట్టణానికి చెందిన దువ్వూరి లక్ష్మీఉదయ, శ్రీరామ భాస్కరకుమారి కుటుంబ సభ్యులు స్వామిని దర్శించుకుని విఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.16,816 విరాళంగా అందజేశారు. ఆలయ ప్రధానార్చకులు వేదాశీర్వచనం అందజేసి దాతలను శేషవస్త్రంతో సత్కరించి స్వామి చిత్రపటంఅందజేశారు.

బాలబాలాజీ ఆదాయం రూ.57.45 లక్షలు



అప్పనపల్లి బాలబాలాజీస్వామి

మామిడికుదురు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి కార్తీకమాసం నెల రోజుల ఆదాయం రూ.57,45,465 వచ్చినట్టు సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. నెలరోజుల పాటు స్వామివారిని 2,28,360 మంది దర్శించుకున్నారని, వారిలో 1,01,280 మంది అన్నప్రసాదం స్వీకరించినట్టు తెలిపారు. గత సంవత్సరం కార్తీకమాసంలో స్వామివారికి ఒక నెలకు రూ.30,25,266 ఆదాయం వచ్చిందని, గతేడాది కంటే ఈ సంవత్సరం ఆదాయం రూ.27,27,199 అధికంగా వచ్చినట్టు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశామని, సహకరించిన సిబ్బంది,నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

2 గంటల్లో ముంబై

రాజమహేంద్రవరం టూ ముంబైకి ఎయిర్‌బస్

ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్



విమాన సర్వీసును ప్రారంభించి కేక్ కట్ చేస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేవలం రెండు గంటల్లోనే రాజమహేంద్రవరం నుంచి ముంబైకి వెళ్లవచ్చని రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం (మధురపూడి) విమానాశ్రయం నుంచి ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు తొలిసారిగా ముంబైకి నేరుగా విమాన సర్వీసును ప్రారంభించి మాట్లాడారు. ఎయిర్ బస్సు సర్వీసుతో రాజమహేంద్రవరం, ముంబైకి మధ్య దూరం తగ్గిందన్నారు. ఈ నెల 12 నుంచి న్యూఢిల్లీకి ఇక్కడ నుంచి విమాన సర్వీసు ఆరంభమవుతుందన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహనాయుడు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పట్టుదలతో ఎయిర్‌బస్ సర్వీసును వేశారన్నారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం 4.50 గంటలకు ముంబై నుంచి బయలుదేరి రాజ మహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు 6.45 గంటలకు చేరుతుందన్నారు. ఈ ఎయిర్‌బస్సు రాత్రి 7.15 గంటలకు ఇక్కడ నుంచి తిరిగి బయలుదేరి రాత్రి 9.05 గంటలకు ముంబై చేరుకుంటుందని చెప్పారు. తొలిరోజు అరగంట ఆలస్యంగా ఎయిర్‌బస్ వచ్చినట్టు చెప్పారు. ముంబై, రాజమహేంద్రవరం మధ్య కేవలం గంట 50 నిమిషాల ప్రయాణం ఉంటుందన్నారు. తొలిరోజు ముంబై నుంచి 172 మందితో రాజమహేంద్రవరం వచ్చిందని చెప్పారు. తిరిగి ఈ ఎయిర్‌బస్సులో 120 మంది ముంబై వెళ్లారని తెలిపారు. ఈనెల 12వ తేదీ నుంచి రాజమహేంద్రవరం నుంచి నేరుగా న్యూఢిల్లీకి ఇండిగో విమాన సర్వీసు ఆరంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, బీజేపీ నేతలు నీరుకొండ వీరన్నచౌదరి, జవ్వాది లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

ఉప్పాడ తీరంలో అలల ఉధృతి



ఉప్పాడ బీచ్‌రోడ్డు పైకి ఎగసిపడుతున్న కెరటాలు

బీచ్‌రోడ్డును తాకుతున్న కెరటాలు

కొత్తపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో ఆదివారం కూడా కెరటాల ఉధృతి కొనసాగుతూనే ఉంది. సాధారణ స్థాయి కంటే 2 నుంచి 3 మీటర్ల ఎత్తులో ఎగసిపడిన రాకాసి అలలు ఉప్పాడ-నేమాం మధ్య బీచ్‌రోడ్డుపైకి దూసుకొస్తున్నాయి. సు బ్బంపేట, కొత్తపట్నం, విద్యుత్ ప్లాంటు ప్రాంతాల్లో కెరటాలు ఉవ్వెత్తున గాలిలో లేస్తూ బీచ్‌రోడ్డును బలంగా తాకుతున్నాయి. దీంతో రోడ్డుకు అడుగు భాగంలో ఉన్న కంకర రాళ్లు రోడ్డుపైకి విసిరేసినట్టు ఎగిరిపడుతున్నాయి. పెద్ద వంతెన సమీపంలో నిర్మించిన అప్రోచ్ వంతెన రోడ్డుపై సముద్ర కెరటాలు విరుచుకుపడుతున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో బీచ్‌రోడ్డులో రాకపోకలను నియంత్రించేందుకు స్థానిక పోలీసులు చర్యలు చేపట్టారు.

ఘనంగా అఖండ కోటి దీపారాధన



సామర్లకోట భీమేశ్వరాలయంలో దీపాలను వెలిగించిన దృశ్యం

సామర్లకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ముగింపు పురస్కరించుకుని కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఆదివారం రాత్రి అఖండ కోటిదీపారాధన పూజలు ఘనంగా నిర్వహించారు. కార్తీకదీపారాధన సేవాసంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ఆవరణ అంతటా చమురు వత్తుల ప్రమిదలతో కూడిన దీపాలను అలంకరించారు. గణపతికి ముందుగా పూజలు నిర్వహించి పండితులచే గంట మోగించగా వందలాది భక్తులు దీపాలను ఒకేసారి వెలిగించడంతో ఆలయ ఆవరణ దీపపు కాంతులతో దేదీప్యమానంగా మారింది. వర్షం కురుస్తున్నా ఏమాత్రం లెక్కించకుండా అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోలిపాడ్యమి అంటే..

కార్తీకమాసంలో వచ్చే చివరి రోజును పోలి స్వర్గం అని అంటారు. డిసెంబరు 1తో కార్తీకం ముగిసింది. మరుసటి రోజును పోలి పాడ్యమి అంటారని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయ అభిషేక పండిట్ వేమూరి సోమేశ్వరశర్మ వెల్లడించారు. దీనితర్వాత రోజు నుంచే మార్గశిరం మాసం ప్రారంభం అవుతుంది. పోలిపాడ్యమి రోజున భక్తులు శివాలయాల్లో పూజలు చేస్తారు. ఈ రోజున 30 వత్తులతో దీపాలను వెలిగించడం ప్రత్యేకత.



వాన.. వల!

యానాం గౌతమీ గోదావరి పుష్కర ఘాట్ వద్ద ఆదివారం వర్షంలో కూడా ఓ మత్స్యకారుడు చేపల కోసం వల వేస్తూ ఇలా కనిపించాడు

-యానాం



కత్తిపూడిలో కలశాలతో వేలాదిగా తరలివస్తున్న భక్తులు

మహాకుంభాభిషేక మహోత్సవం

కత్తిపూడిలో విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామికి అభిషేకం

శంఖవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలంలో కత్తిపూడి విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామివారి మహాకుంభాభిషేక మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామమంతా శివ పంచాక్షరీనామంతో మార్మోగింది. పరసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది భక్తులతో, సువాసినీ మహిళలతో నిర్వహించిన కార్యక్రమం కనుల పండువగా జరిగింది. కార్తీకమాస అమావాస్య పర్వదినాన సప్తనదీ జలాలతో పురవీధుల్లో తిరిగి పరమశివుడికి అభిషేకం చేశారు. వేలాదిమంది సువాసినీ మహిళలు కలశాలతో గ్రామపుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించి అనంతరం స్వామి,అమ్మవార్లకు ఏకకాలంలో అభిషేకం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ పూజారి ర్యాలీ సుబ్రహ్మణ్యకుమార్, ధర్మకర్త మంచాల సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజలు, హోమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేక అనంతరం మహా అన్న సమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి వేలాదిమంది పాల్గొన్నారు.



ఆలయ శిఖరానికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన!

అక్రమాలకు పాల్పడిన రంపచోడవరం

గిరిజన సంక్షేమ ఇన్‌చార్జి డీడీ

ఉన్నతాధికారులకు తెలియకుండా

14 మంది సిబ్బందికి డిప్యుటేషన్లు

ఎన్నికల సంఘం, ఉన్నతాధికారులకు

ఆదివాసీ సంఘం ఫిర్యాదులు

రంపచోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా రంపచోడవరంలోని గిరిజన సంక్షేమ ఇన్‌చార్జి డీడీ ఒకరు అక్రమాలకు పాల్పడి 14 మంది సిబ్బందిని డిప్యుటేషన్లపై బదిలీ చేస్తూ వివాదస్పద ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బాగోతాన్ని ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ సాంస్కృతిక సంఘం వెలుగులోకి తెచ్చి ఎన్నికల సంఘానికి, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తూ ఆ సమాచారాన్ని మీడియాకు తెలిపారు. ఈ బాగోతం పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయానికి అనుబంధంగా నడుస్తోంది. ఈ డిప్యూటీ డైరెక్టర్ పోస్టు గత కొన్నేళ్లుగా ఇన్‌చార్జిలతోనే నడుస్తోంది. ఇటీవల ఈ పోస్టుకు వేరే అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. సదరు అధికారి రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి నుంచి ఎటువంటి ఆమోదాలు తీసుకోకుండానే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే తన కార్యాలయం నుంచి డిప్యుటేషన్లపై బదిలీలు చేపట్టారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున ముడుపులు ఆయా అధికారులకు, కార్యాలయం సిబ్బందికి ముట్టాయని ఆదివాసీ సాంస్కృతిక సంఘం నాయకులు కత్తుల ఆదిరెడ్డి, తాడే రాజబాబు ఆరోపించారు. తక్షణం సదరు అధికారిని డీడీ బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఎన్నికల సంఘం, ఎన్నికల ఉన్నతాధికారులు అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కన్నబాబు.. అప్పుడు నోరు పెగల్లేదేమి?

ఇప్పుడు రేషన్ బియ్యం అవినీతిపై ఉలికిపాటెందుకు

కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు మండిపాటు



ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో కాకినాడ పోర్టు నుంచి లక్షల టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా ఎగుమతి అయినా వైసీపీ నేతల నోళ్లు పెగల్లేదని, కళ్లముందే వందల కోట్ల రూపాయల బియ్యం ద్వారంపూడి తరలించినా మంత్రి హోదాలో కన్నబాబు కళ్లప్పగించి చూశారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మండిపడ్డారు. కాకినాడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అప్పుడు ద్వారంపూడికి భయపడి కన్నబాబు నోరు మెదపలేదన్నారు. బియ్యం ఎగుమతిలో వైసీపీ నేతలు ఉండడం వల్లే ప్రశ్నిస్తే మంత్రి పదవి పోతుందని కళ్లప్పగించి చూశారన్నారు. గడచిన ఐదేళ్లలో పోర్టులో రేషన్ బియ్యం అక్రమ ఎగుమతిపై తాను పోరాడానన్నారు. ఈ బియ్యాన్ని తనిఖీ చేసేందుకు పోర్టు లోపలికి వెళ్తే తమపై అక్రమ కేసులు పెట్టించారని, తప్పులు చేయకపోతే తమపై అక్రమ కేసులు ఎందుకు పెడతారని అన్నారు. కాకినాడ టీడీపీ కార్యాలయంపై దాడికి ఎందుకు దిగారని, ఆ రోజు కన్నబాబు నోరు ఎందుకు పెగల్లేదన్నా రు. ద్వారంపూడి ఐవరీ కోస్ట్‌కు వెళ్లి బియ్యం గొడౌన్‌లు కట్టించాడని తాను ఆధారాలతో సహా బయటపెట్టానన్నారు. కూటమి ప్రభుత్వం రేషన్ బియ్యం అక్రమ ఎగుమతిపై ఉక్కుపాదం మోపుతుంటే పెడబొబ్బలు పెడుతున్నారని కొండబాబు అన్నారు.

దుబాయ్‌లో పేరవరం వాసి అనుమానాస్పద మృతి



రమేష్(ఫైల్)

పది రోజుల క్రితమే మృతి

మంత్రులు లోకేశ్, నిమ్మల సహకారంతో

నేడు స్వగ్రామానికి మృతదేహం

కన్నీరుమున్నీరవుతున్న బంధువులు

ఆత్రేయపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లిన ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు. పదిరోజులు కావొస్తున్నా మృతదేహం ఇంటికి రాకపోవడంతో ఆ కుటుంబ సభ్యులు వేదన చెందుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన అంగర రమేష్(35) దుబాయ్‌లోని డేరా ప్రాంతంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. ఏడాదిన్నర క్రితం వెళ్లి ఉద్యోగంలో చేరినా మధ్యలో స్వగ్రామం వచ్చి 6 నెలల క్రితమే తిరిగి వెళ్లాడు. రమేష్‌కు భార్య కవితాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. అక్కడ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.ఇదిలా ఉండగా గత నెల 15న అనుమానాస్పదంగా మృతిచెందాడు.అక్కడ మిత్రులు కుటుంబీకులకు సమాచారం అందించారు. అయితే మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించడంలో జాప్యం జరుగుతోంది. రమేష్ మృతిపై అక్కడ ప్రభుత్వం విచారణలో తేల్చాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రమేష్ భార్య కవిత బంధువులు ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి లోకేశ్‌కు విషయాన్ని వివరించారు.అక్కడ ప్రతినిధులతో మాట్లా డి మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించే చర్యలు వేగవంతం చేశారు. దుబాయ్ నుంచి విమానంలో మృతదేహాన్ని గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చే ఏర్పాట్లు చేపట్టారు. సోమవారం గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువస్తున్నట్టు సమాచారం.రమేష్ మృతితో పేరవరం గౌడపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధు మిత్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పాపికొండలకు పోటెత్తిన పర్యాటకులు



పేరంటాలపల్లిలో పర్యాటకుల సందడి

దేవీపట్నం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాపికొండలు అందాలను తిలకించేందుకు ప్రకృతి ప్రేమికులు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ఆదివారం వెళ్లారు. అల్లూరి జిల్లా దేవీపట్నం మండల పరిధిలోని పోశమ్మగండి బోట్ పాయింట్ నుంచి గోదావరి పరివాహక ముంపు ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, మంటూరు, గొందూరు, కచ్చులూరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా పేరంటాలపల్లి వెళ్లి ఆ గ్రామంలో శివున్ని దర్శించుకుని సందడి చేశారు. ముందుగా మాతృశ్రీ గండిపోశమ్మఅమ్మవారిని దర్శించుకుని అనంతరం ఆరు బోట్లలో 450 మంది పర్యాటకులు పాపికొండలు వెళ్లారు. గోదావరి వరదల అనంతరం గండిపోశమ్మ అమ్మవారి దర్శనం పునఃప్రారంభించగా రెండో ఆదివారం దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. అమ్మవారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్‌కు 13 మంది ఎంపిక

రాజమహేంద్రవరం సిటీ డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ ప్రవేశ పరీక్షల్లో 13 మంది అభ్యర్థులు అర్హత సాధించారని బీసీ సడీ సర్కిల్ సంచాలకులు కెఎన్.జ్యోతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సివిల్ సర్వీస్ ఉచిత కోచింగ్‌కు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 70 మంది హాజరు కాగా 13 మంది అర్హత సాధించారన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గొల్లపూడి కేంద్రంలో 6నెలల పాటు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని, ఉచిత సివిల్ కోచింగ్‌కు ఎంపికైన అభ్యర్థులు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'రేషన్ బియ్యం అక్రమాల్లో నా పాత్ర లేదు'

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలను వక్రీకరిస్తూ కొందరు ప్రచారం చేస్తున్నారని, ఎక్కడా తన కోసం ఆయన తప్పుగా మాట్లాడలేదని శాన్‌మెరైన్ సంస్థ అధినేత అలీషా ఆదివారం ఒక ప్రకటన వెలువరించారు. రేషన్ బియ్యం అక్రమాల్లో తన పాత్ర ఎక్కడా లేదన్నారు. తనిఖీల్లో భాగంగా పవన్ కేవలం అలీషా ఎవరని అడిగారన్నారు. పోర్టులో బియ్యం ఎగుమతి, దిగుమతులతో తనకు సంబంధం లేదని, తనకు ఉన్న ఏకైక వ్యాపారం నౌకలను తయారు చేయడం మాత్రమేనన్నారు. రేషన్ అక్రమ రవాణాలో ఏ భాగస్వామ్యంలేదని తెలిపారు.

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ భావన తెలిపారు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఉదయం 9.30గంటల నుంచి డయల్ యువర్ కమిషనర్, తదుపరి 10 నుంచి 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహిస్తామన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీలు



పెద్దాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజానికి సమాజంలో ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని వైజ్ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు మల్లీశ్వరి, జయ, శైలజ అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో పలు స్వచ్ఛంధ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో వారు మాట్లాడారు. ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ పట్టణ వీధుల్లో తిరుగుతూ ప్రజలకు ఎయిడ్స్ వ్యాధి వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయశేఖర్, ఎస్ఐ వి.మౌనిక, నూతలపాటి అప్పలకొండ, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాస్, నానిబాబు, శ్రీనుబాబు, ఏఎన్ఎం పాల్గొన్నారు.

పిఠాపురం: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి(సీహెచ్‌సీ)లో హెచ్ఐవీ బాధితులకు పండ్లు, దుస్తులు అందజేశారు. ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ సుజాత, డాక్టర్ షారోన్ కీర్తన, ఐసీటీసీ లక్ష్మీ, ల్యాబ్‌టెక్నిషియన్ ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



గొల్లప్రోలు రూరల్: అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్: తాటిపర్తిలోని సచివాలయం వద్ద ఎయిడ్స్ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ బీఎస్ఎస్ గీత, ఏ.సత్తిబాబు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లరేవు: తాళ్లరేవు బీమాబాయి మహిళా మండలి కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన అధ్యక్షతన ఎయిడ్స్‌పై సమావేశం జరిగింది. ఎయిడ్స్‌పై గ్రామంలో కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి బాధితులకు అండగా నిలుద్దాం సమన్వయంతో ఎయిడ్స్ తరిమికొడదామని నినాదాలు చేశారు. బీమాబాయి మహిళా మండలి కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి చెస్‌లో గంగాధర్‌కు కాంస్య పతకం



సర్పవరం జంక్షన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర భోపాల్‌లో జరిగిన స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 17 చెస్ విభాగంలో కాకినాడ కేంద్రీయ విద్యాలయానికి చెందిన పదో తరగతి విద్యార్థి యశస్వి సత్య గంగాధర్ కాంస్య పతకం సాధించాడు. నవంబరు 17 నుంచి 21 వరకు భోపాల్ స్కూల్‌ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్-17 చెస్‌పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి కేంద్రీయ విద్యాలయ తరపున సత్య గంగాధర్ పాల్గొని ఆఖరి రౌండ్‌లో మహారాష్ట్రకు చెందిన విద్యార్థిని ఓడించి కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. గతంలో గంగాధర్ కేంద్రీయ విద్యాలయం తరపున నేషనల్‌లో వరుసగా మూడు గోల్డ్ మెడల్స్ సొంతం చేసుకున్నాడు. మూడు సార్లు స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకి ఎంపికయ్యాడు. 2018నుంచి 2024 వరకు రాష్ట్రస్థాయిలో జరిగిన చెస్ పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు సాధించాడు. ఇప్పటి వరకు 52 మెడల్స్ సొంతం చేసుకున్నాడు. సత్య గంగాధర్‌ని కేవీ స్కూల్ ప్రిన్సిపాల్ బొంతు శేఖర్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఐక్య క్రిస్మస్ వేడుకలు

పిఠాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని ఆంధ్రా బాప్టిస్టు సెంటినరీ చర్చిలో ఆదివారం రాత్రి నియోజకవర్గస్థాయి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. జంగారెడ్డిగూడేనికి చెందిన ప్రసంగీకులు డాక్టర్ ఏఆర్ పాల్సన్ క్రిస్మస్ వాక్యోప సందేశాన్ని అందించారు. పలువురు క్రైస్తవ గీతాలు ఆలపించారు. చిన్నారులు చేసిన నృత్యాలు, ప్రదర్శించిన నాటికలు అందరిని అలరించాయి.

డ్రైవర్ల నిర్లక్ష్యం... ప్రయాణికులకు ప్రమాదం!

బీచ్‌రోడ్డులో లారీల నుంచి రోడ్డుపై పడుతున్న ఎరువుల ముడిసరుకు

పట్టించుకోని డ్రైవర్లు

ఆందోళన చెందుతున్న ప్రయాణికులు



కోరమండల్ బీచ్ రోడ్‌లో లారీ నుంచి రోడ్డుపై పడుతున్న ఎరువుల ముడిసరుకు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ వలసపాకల-వాకలపూడి బీచ్‌రోడ్డులో లారీలపై రవాణా అవుతున్న ఎరువుల ముడి సరుకు రోడ్డుపై కారిపోవడంతో ప్రయాణికులు ప్రమాదాలబారిన పడుతున్నారు. పోర్టు నుంచి దిగుమతి అవుతున్న యూరియా రా మెటీరియల్ ఎరువుల కర్మాగారాల లారీలపై లోడు వేసుకుని వెళుతున్నారు. యూరియా లారీ నుంచి రోడ్డుపై పడకుండా లారీ చుట్టూ రక్షణగా తారపాలిన్ షీట్లు కట్టాలి. లారీ డ్రైవర్లు అవేమీ కట్టకుండా లారీలపై రా మెటీరియల్ వేసుకుని రవాణా చేస్తుండడంతో బీచ్‌రోడ్డు అంతా యూరియాతో ఉంటుంది. మంచు, వర్షాలకు రోడ్డు అంతా బురదగా మారడం, జారిపోవడంతో బైక్‌పై వెళ్లే ప్రయాణికులు రోడ్డుపై పడి ప్రమాదాల బారినపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లారీలకు తారపాలిన్లు కట్టాలని లారీ డ్రైవర్లకు చెబితే దూర్భాషాలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై లారీ డ్రైవర్లు, నిర్వాహకులపై చర్యలు తీసుకుని ప్రయాణికులు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

సహస్ర దీపాలంకరణ



పిఠాపురం వేణుగోపాలస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పిఠాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి సహస్ర దీపాలంకరణ సేవ జరిగింది. ఆలయ ప్రాంగణంలో భక్తులు దీపాలు వెలిగించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకుడు విజయజనార్థనాచార్యులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సేవాసమితి సభ్యులు, ఈవో నున్న శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలులో దీపారాధన

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివాలయంలో ఆదివారం రాత్రి దీపారాధన వైభవంగా జరిగింది. కార్తీకమాసం చివరిరోజు పురస్కరించుకుని ఆలయంలోని పర్వతవర్థిని సమేత రామలింగేశ్వరస్వామి సన్నధిలో భక్తులు శివలింగం, నందీశ్వరుడు స్వస్తిక్, ఓమ్ తదితర అలంకారాల్లో దీపాలు వెలిగించారు. ఆలయ కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సాగరతీరంలో ఘనంగా మహాకుంభాభిషేకం

భారీసంఖ్యలో హాజరైన భక్తులు



శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

కాకినాడ సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ సాగరతీరంలోని శ్రీమంగళాంబిక సమేత ఆదికుంబేశ్వరస్వామి ఆలయం వద్ద కోటి8 లక్షల శివలింగాలకు 49వ మహాకుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. కార్తీక అమావాస్య పర్వదినాన ఆదివారం నిర్వహించిన మహా కుంభాభిషేకానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. విఘ్నేశ్వరపూజ, పంచ కాటక పఠనం, వేద పఠనం చేసి కోటి 8లక్షల శివలింగాలకు మహా కుంభాభిషేకం చేశారు. రసలింగేశ్వరునికి విభూదితో మహాకుంభాభిషేకం, అభిషేక ద్రవ్యాలు జరిపి 108మంది యువతులతో అభిషేక ద్రవ్యాలను సముద్రంలో నిమజ్జనం చేయించారు. ఆది కుంబేశ్వరస్వామికి మారేడు దళాలతో కుంభాభిషేకం చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నప్రసాదం, పిల్లలకు పాలు సమకూర్చారు. భక్తులు, దాతల సహకారంతో 49వ మహా కుంభాభిషేకం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు, దాతలు బోగిరెడ్డి తాతయ్య నాయుడు, తోట పుండరీకాక్షయ్య(బాబీ), చిట్నీడి శ్రీనివాస్, గంగాపాత్రుని శ్రీనివాస్, నామన సత్య ప్రసన్న పర్యవేక్షించారు. రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, పంతం సందీప్, మాజీ కార్పొరేటర్లు స్వామి,అమ్మవార్లను దర్శించారు.

పాదగయకు భక్తుల తాకిడి



కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

పిఠాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి రోజు, అమావాస్య సందర్భంగా ఆదివారం పిఠాపురంలో పాదగయ క్షేత్రానికి భక్తుల తాకిడి అధికంగా ఉంది. వర్షం కురుస్తున్నప్పటికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పుర్హుతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. కుక్కుటేశునికి అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. వారికి ఏర్పాట్లను ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీవివాస్ పర్యవేక్షించారు.

చిన్నారి శస్త్ర చికిత్సకు రూ.లక్ష విరాళం



నగదు అందిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

సర్పవరం జంక్షన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తీవ్రంగా కాలిన గాయాలతో బాధపడుతున్న చిన్నారి జాహన్విశ్రీ శస్త్రచికిత్స కోసం శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఆదివారం కాకినాడ యంగ్ మైండ్స్ (రేపటి కోసం) సంస్థ ఆధ్వర్యంలో భానుగుడి క్యాపిటల్ ఆసుపత్రిలో చిన్నారి తండ్రి వీరబాబుకు రూ.1 లక్ష నగదు డాక్టర్ చంద్రశేఖర్ అందజేశారు. చిన్నారి త్వరితగతిన కోలుకునేలా యంగ్ మైండ్స్ సభ్యులు చేస్తున్న కృషిని అభినందించారు. సభ్యులు విరాళం అందించడమే కాకుండా కేపిటల్ ఆసుపత్రి వైద్యులు సైతం ఉదార స్వభావంతో సుమారు రూ.4 లక్షలు దాకా వెచ్చించి నాణ్యమైన వైద్యసేవలు అందించడం నిరుపేదల పట్ల వారికి ఉన్న సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో యంగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు వాకాడ వెంకటరమణ, డాక్టర్ సందీప్, రమణ, డీవీవీ బాపిరాజు, కరీమ్ పాల్గొన్నారు.

అలాగే కాకినాడ రూరల్ టీడీపీ కోఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబీ) చిన్నారి జాహన్విశ్రీ శస్త్రచికిత్స కోసం రూ.10వేలు ఆర్థికసాయాన్ని కటకంశెట్టి వీర వెంకట సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ తరపున అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ జీశ్రీనివాసరావు పాల్గొన్నారు.

శిరివాడలో అభిషేకాలు

పెద్దాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరివాడ గ్రామంలో కార్తీక మాసం ముగింపు సందర్భంగా గ్రామంలో కొలువైన పార్వతీ సమేత బ్రహ్మేశ్వరస్వామికి గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. పలు రకాల సుగంధ ద్రవ్యాలు, సేంద్రియ వస్తువులతో తయారుచేసిన తొమ్మిది అడుగుల మహాశివలింగాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. శివలింగాన్ని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం ఏలేరు కాలువలో నిమజ్జనం చేశారు.



మహా శివలింగానికి పూజలు చేస్తున్న దృశ్యం

ఘనంగా కార్తీక వనసమారాధనలు







మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణమూర్తి దంపతులకు సన్మానం, ఐక్యత చాటుతున్న శెట్టిబలిజ సంఘ నాయకులు, పిఠాపురంలో విసరపు కుటుంబసభ్యుల వనసమారాధనలో ఆటపాటలతో సందడి

● పలు సంఘాల ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధనలు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జనగణనతో పాటు కుల గణన చేయాలని, బీసీలంతా ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విఠల్ కుమార్ కోరారు. ఆదివారం కాకినాడ రూరల్ తిమ్మాపురం మామిడితోటలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం, జిల్లా అధ్యక్షులు రామానుజం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ద్వితీయ కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల గణన చేయాలని, బీసీలకు చట్టభద్రత కల్పించాలని, పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వానికి వినతి పత్రం అందించామన్నారు. విశిష్ట అతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు మాట్లాడుతూ చట్టసభల్లో రిజర్వేషన్లు కచ్చితంగా పాటించేలా సంఘటితంగా సభ్యులు కృషి చేయాలని కోరారు. ఈసందర్భంగా జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మిసత్యనారాయణమూర్తి దంపతులను ఘనంగా సత్కరించారు. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రామ రాఘవ, వర్కింగ్ ప్రెసిడెంట్ అద్దంకి వెంకన్నబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి గంటి రాధాకృష్ణ, ఆర్థిక కార్యదర్శి వాసంశెట్టి కామేశ్వరరావు, కమిటీ ప్రతినిధులు చోడే శ్రీనివాస్, సంగాడి రాజసింహ వర్మ, ఎం.శ్రీనివాస్, ఆర్.శ్రీనివాస్, డి.సుధాకర్, జి.భీమశంకరరావు, వేంద్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

'పాన్‌షాపు' వనసమారాధన

సర్పవరంజంక్షన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ పాన్‌షాపు యాజమానుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాదవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అన్నదాన సమాజంలో కార్తీక వనసమారాధన ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ హాజరయ్యారు. ఏడాదికోసారి ఒకచోటకు కుటుంబ సభ్యులతో విచ్చేసి కార్తీక వనసమారాధనలో పాల్గొనడం మంచి పరిణామమని చైర్మన్ తోట సుధీర్ అన్నారు. ప్రభుత్వపరంగా యూనియన్‌కు అవసరమైన సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా హౌసీ, క్విజ్, ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం తోట సుధీర్‌ను ఘనంగా సత్కరించారు. విజన్, వాసన్ ఐకేర్ ఆసుపత్రి నిర్వాహకుల ఆధ్వర్యంలో ఉచితంగా బీపీ,షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గోపిశెట్టి బూరయ్య, అరిగెల వెంకటకృష్ణారావు, సంఘం గౌరవాధ్యక్షులు మేళం వెంకట రమణ, సెక్రటరీ నందికోళ్ల సత్తిరాజు, పరిమి వీర భద్రరావు, వనిమిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

'శెట్టిబలిజ' వనసమారాధన

కాకినాడసిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ రెవెన్యూ కాలనీలో శెట్టిబలిజ కులస్తులకు కేటాయించిన స్థలంలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సహకారంతో త్వరితగతిన కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేద్దామని శెట్టిబలిజ సంఘ నాయకులు అన్నారు. సాంబమూర్తినగర్ రెవెన్యూ కాలనీలో ఆదివారం ఏర్పాటుచేసిన శెట్టిబలిజ కార్తీక వన సమారాధనకు వివిధ ప్రాంతాల నుంచి నాయకులు, సంఘీయులు తరలివచ్చారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘ నాయకులు గెద్దాడ వెంకటేశ్వరరావు, పితాని నూకరాజు, చొల్లంగి వేణుగోపాల్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, గుత్తుల శ్రీనివాస్, యు.కొత్తపల్లి జడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి ఈశ్వరి పాల్గొని ప్రసంగించారు. కార్తీక వనసమారాధన ఆటపాటలు, కూచిపూడి నృత్యాలతో ఆహ్లాదకరంగా సాగింది. కార్యక్రమంలో నాయకులు వాసంశెట్టి భీమరాజు, కాకరపల్లి చంద్రశేఖర్, కడియాల సూర్యనారాయణ, అనుసూరి నాగేశ్వరరావు, చింతాకుల శ్రీనివాస్, కుడుపూడి వెంకట లక్ష్మి, బత్తిన భవాని తదితరులు పాల్గొన్నారు.

'విసరపు' కార్తీక వనసమారాధన

పిఠాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, వృత్తి, వ్యాపారాల రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విసరపు కుటుంబసభ్యులంతా ఒకేచోటకు చేరారు. ఆటపాటలతో సందడి చేశారు. పిఠాపురం పట్టణ శివారులోని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో విసరపు మరిడయ్య, సుబ్బారావు కుటుంబాలకు చెందిన కార్తీక వనసమారాధన ఆదివారం జరిగింది. 150మందికి పైగా కుటుంబసభ్యులు వనసమారాధనకు హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సరదాగా గడిపారు. యోగా క్షేమాలను తెలుసుకున్నారు. కుటుంబ పెద్దలను సత్కరించారు. కార్యక్రమంలో విసరపు రంగారావు, వాసు, మాధవ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

లోక్‌అదాలత్‌ల ద్వారా సత్వర పరిష్కారం

పిఠాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కోర్టులో అపరిష్కృతంగా ఉన్న వాజ్యాలను రాజీమార్గంతో లోక్‌అదాలత్‌ల ద్వారా పరిష్కరించుకుంటే సమయం ఆదా కావడంతో పాటు సత్వర న్యాయం లభిస్తుందని న్యాయవాది కొంజర్ల అప్పారావు తెలిపారు. పిఠాపురం పట్టణం బొజ్జావారితోటలోని లిటిల్‌స్టార్స్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు కార్యాలయంలో ఆదివారం ఎయిడ్స్ డే, చట్టాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. తొలుత ప్రదర్శన జరిపారు. 12వ జిల్లా అదనపు జడ్జి ఏ.వాసంతి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో న్యాయవాదులు సత్యవేణి, అల్లాడ గీత, శ్రీనివాస్, లోక్‌అదాలత్ సిబ్బంది రాజేశ్వరి, దుర్గాశ్రీనివాస్, పారా లీగల్‌వలంటీర్లు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డులో సభ్యులుగా చేరాలి

కాకినాడ సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డులో సభ్యులుగా చేరి గుర్తింపు కార్డు పొందాలని ఏపీ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ అన్నారు. సంతచెరువు వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన లక్ష్మీగణపతి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. సంక్షేమ బోర్డులో సభ్యుడిగా నమోదు కోసం కుటుంబసభ్యుల ఆధార్ కార్డులు, రేషన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు యూనియన్ వారికి అందజేయాలన్నారు. దీనికి యూనియన్ అధ్యక్షుడు రాజు అధ్యక్షత వహించారు.

వసతిగృహ విద్యార్థులకు దుప్పట్లు అందజేత

పిఠాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ డివిజన్ పరిధిలోని అన్ని కళాశాల వసతిగృహాల విద్యార్థులకు మొదటిసారి దుప్పట్లు పంపిణీ చేశారు. శీతాకాలంలో దుప్పట్లు లేక వసతిగృహాల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో జిల్లా కలెక్టర్ సహకారంతో వీటిని పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో డీబీసీడబ్ల్యూఈవో లల్లీ, వసతిగృహ సంక్షేమాధికారులు పాల్గొన్నారు. కాగా దుప్పట్లు అందించిన డిప్యూటీ సీఎం, కలెక్టర్లుకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

రక్త దానం చేయాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తాళ్లరేవు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి రక్తం దానంచేసి ప్రాణదాతలు కావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. ఆదివారం పి.మల్లవరంలో తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటుచేసిన కాకినాడ రోటరీక్లబ్ రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వెంకటరమణను ఘనంగా సన్మానించి కేక్ కట్‌చేశారు. ధూళిపూడి అభిమానులు 67మంది రక్తంను దానం చేశారు. ధూళిపూడి 82వ సారి రక్తదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్రశెట్టిబలిజ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, టీడీపీనేతలు మందాల గంగసూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు, పోలేకుర్రు గ్రామకమిటీ అధ్యక్షుడు వడ్లమూరి సతీష్, జక్కల ప్రసాద్, రేల్ల చక్రవర్తి, మోపూరి వెంకటేశ్వరరావు, గండి అప్పారావు, వుంగరాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

సామర్లకోట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సామర్లకోట ప్రభుత్వ కళాశాల మైదానంలో వివిధ క్రీడల్లో శిక్షణ పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సామర్లకోటకు చెందిన క్రీడాకారులు యశ్వంత్ తేజ్(క్రికెట్), వర్షిత, అరుణ(కబడ్డీ), కిరణ్(బాస్కెట్‌బాల్)లను సామర్లకోట ఫ్రెండ్స్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఆదివారం సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా క్రీడాకారులను శాలువాలతో, పూలమాలలతో సత్కరించారు. విప్పర్తి కొండలరావు, గుండు శంకరరావు, నాయుడు మాస్టారు, ఎండీ సైపుల్లా, నక్కా శ్రీనువాసు, పిట్టా సత్యనారాయణ, ఎండీ.ఖాన్, లిక్కర్ శ్రీను, లింగం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వర్తక సంఘం అధ్యక్షుడికి సత్కారం

తాళ్లరేవు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా సుంకరపాలెం కాపు కల్యాణమండపంలో శ్రీలక్ష్మీ గణపతి వరసిద్ధి వినాయక వర్తక సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆటపాటలు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. నూతనంగా ఎం పికచేసిన వర్తక సంఘం అధ్యక్షుడు పుగాపు వాసును సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో సుంకరపాలెం బైపాస్ సెంటర్ వర్తక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై బురద.. ప్రజల ఇబ్బందులు



జయలక్ష్మీ టాకీసు రోడ్డుపైకి చేరిన మురుగునీరు, వ్యర్థాలు

సామర్లకోట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సామర్లకోటలో ఆదివారం కురిసిన వర్షానికి పలు ప్రధాన డ్రైన్లు పొంగి ప్రవహించాయి. మురుగు నీరు రోడ్లపైకి చేరడంతో పలు రోడ్లు మురుగు బురదతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జయలక్ష్మీ టాకీసు రోడ్డు, ప్రకాష్ నగర్, జగ్గమ్మగారిపేట తదితర ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా మురికి చేరడంతో పలు చిరువ్యాపారులు సైతం తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఇటీవల పట్టణంలోని మురుగు కాల్వల్లో పూడిక తొలగించేందుకు సుమారు రూ.36 లక్షలు వ్యయం చేసినప్పటికీ కొద్దిపాటి వర్షానికే కాల్వల్లో మురుగు రోడ్లపైకి చేరుతుండడంతో అధికారుల పనులు వృధాప్రయాసగా మారాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల రెండు రోజుల క్రితం జరిగిన కౌన్సిల్ సమావేశంలో పూడికతీత పనులపై పలు అనుమానాలు వ్యక్తంచేసినప్పటికీ అధికారుల నుంచి స్పష్టమైన సమాచారం సభ్యులకు తెలియజేయలేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా తెలుస్తోంది.

భీమేశ్వరాలయంలో విశేష కార్తీక పూజలు





స్వామికి లక్షపత్రిపూజలు, అమ్మవారికి అలంకరణ

సామర్లకోట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ఆదివారం సామర్లకోట కుమారరామభీమేశ్వరాలయంలో విశేష పూజలు నిర్వహించారు. కార్తీక అమావాస్య, కార్తీకమాసం చివరి రోజు ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్ శర్మ, అంజిబాబు, వెంకన్న తదితరుల వేదమంత్రోచ్చారణల మధ్య అభిషేకపూజలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి చినుకులు పడుతున్నప్పటికీ జిల్లా నలుమూలలు, రాష్ట్రం నలు మూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు, స్వామి,అమ్మవార్లను దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద జరిగిన ఆకాశదీప పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు. భీమేశ్వరా కార్తీక దీపారాధన సేవాసంఘం సభ్యులు ఆలయ ఆవరణలో ఆదివారం మధ్యాహ్నం మహాన్నదానం నిర్వహించారు. 10వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

గండేపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గండేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నేడు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ పనిచేయని కారణంగా మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామని ఈ విషయం అర్జీదారులు గమనించాలన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

యథేచ్ఛగా ఎర్రమట్టి దోపిడీ

● అక్రమంగా తరలిపోతున్నా అధికారుల చోద్యం

● జిల్లా కలెక్టరు, ఐటీడీఏ పీవోల దృష్టికి గిరిజన సంఘం ఫిర్యాదులు



లారీలో ఎర్రమట్టిని తరలిస్తున్న దృశ్యం

రంపచోడవరం/దేవీపట్నం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): అల్లూరి మన్యం నుంచి తూర్పు గోదావరిలో పలు ప్రాంతాలకు పెద్ద ఎత్తున ఎర్రమట్టి దోపిడీ ప్రహసనంగా సాగుతోంది. దేవీపట్నం మండలంలోని పలు ప్రాంతాలలోని వ్యవసాయ భూములను సైతం అక్రమ క్వారీలుగా మార్చేశారు. రైతుల భూముల ముసుగులో ఆయా భూముల్లోని ఎర్రమట్టిని పార్టీలకు అతీతంగా నాయకులు దందాగా సాగిస్తున్నారు. ముఖ్యంగా కడియం తదితర ప్రాంతాలలోని నర్సరీల వంకతో ఇక్కడి నుంచి పెద్ద పెద్ద క్వారీ లారీల్లో తరలించుకుపోతున్నారు. రైతు భూముల నుంచి అవసరంలేని మట్టిని తరలిస్తున్నామన్న వంకతో ఆయా రైతుల ఆమోదాలతో ఈ ఎర్రమట్టిని తరలిస్తున్నట్టు చూపుతున్నప్పటికీ సాగుతున్న భాగోతమంతా అక్రమంగానే సాగుతోంది.

అక్రమ క్వారీలు

దేవీపట్నం మండలం శరభవరం-కొత్త నేలకోట గ్రామాల మధ్య ఒక క్వారీ, ఎమ్.రావిలంక-ముసినిగుంట గ్రామాల మధ్య ఒక క్వారీ అక్రమంగా నడుస్తోంది. నిబంధనల ప్రకారం మన్యంలో నుంచి మైదాన ప్రాంతాలకు ఎటువంటి మైనింగ్ మెటీరియల్ అయినా, అది మట్టయినా వేరేదైనా ఇష్టానుసారంగా తరలించుకుపోవడానికి వీల్లేదు. ఈ భాగోతాన్ని నిలువరించాల్సిన మైనింగ్, రెవెన్యూశాఖలు చోద్యమే చూస్తున్నాయి. ఇక్కడ ఎర్రమట్టి ఉన్న గిరిజన రైతుల భూములను ఎంచుకుని వారికి లీజు రూపంగానో వేరే ఇతర రూపాలగానో నగదు ముట్టచెప్పి ఆయా భూముల నుంచి ఈ మట్టిని యథేచ్ఛగా తవ్వుకుంటూ ప్రధాన రాజకీయపార్టీల నాయకులందరూ వ్యాపారాలు సాగిస్తున్నారు. లోపాయికారి ఒప్పందాలతో ఆయా అధికారులు కూడా చూసీ, చూడనట్టే వదిలేస్తున్నారు. అక్రమమా కాదా అన్నది పక్కన బెడితే గిరిజన భూములు ఈ అక్రమ తవ్వకాలతో గుల్ల అవుతున్నాయి. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు కింద పునరావాస కాలనీలు కలిగిన ప్రాంతాలకు సమీపంలోని భూముల్లోనూ, నిర్వాసితులకు ఇచ్చిన భూముల్లో మట్టిని అక్రమ తవ్వకాలను ఎక్స్‌వే టర్లతో సాగించి తరలించుకుపోతున్నారు. ఈ భాగోతాలపై ఇప్పటికే సమగ్ర పరిశీలిన సాగించిన సీపీఎం నాయకులు, గిరిజన సంఘం నాయకులు జిల్లా కలెక్టరుకు, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి ఫిర్యాదులు చేసి తక్షణం ఈ అక్రమ మట్టి తవ్వకాలను, తరలింపులను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

మైనింగ్ మాఫియా భూమిని పరిశీలించిన నాయకులు

దేవీపట్నం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవారం గ్రామ సమీపంలో జీడిమామిడి తోటలో మైదాన ప్రాంతానికి అక్రమంగా రవాణా చేసిన ఎర్రమట్టి క్వారీలను ఆదివారం బీజేపీ, ఆదివాసీ జేఏసీ నాయకులు పరిశీలించారు. రెండు ఎకరాల జీడిమామిడి తోటను నరికి అక్రమంగా ఎర్రమట్టిని తరలించిన అక్రమార్కులపై సంబంధిత అధికారులు పూర్తి సమగ్ర విచారణ జరిపి కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు తెల్లం శేఖర్, యలగాడ నాగేశ్వరరావు, మద్దేటి అంజిరెడ్డి, కుండ్ల సాయి, నడిపూడి గణపతిరెడ్డి, నడిపూడి భానుశంకర్‌రెడ్డి, సూరిబాబు, బుచ్చిరాజు, వెంకటరమణ పాల్గొన్నారు.

వరి రైతుల్లో ఫెంగల్ ఆందోళన

● అక్కడక్కడ చిరు జల్లులు



తోటపల్లిలో ధాన్యంపై టార్పాలిన్లు కప్పుతున్న దృశ్యం

ఎటపాక, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ కారణంగా వాతావరణంలో ఏర్పడిన మార్పులతో ఏజెన్సీలోని వరి పంట సాగుచేసిన రైతులు కలవరపడుతున్నారు. రెండురోజులుగా మండలంలో పలు ప్రాంతాల్లో చిరుజల్లులు పడడంతో వరి పంట సాగుచేసిన రైతులు ఆందోళనలో ఉన్నారు. ఆదివారం మండలంలో అనేకచోట్ల చిరుజల్లులు కురిశాయి. వాతావరణ మార్పుతో రైతులు పంట నూర్పిళ్లచేసిన దాన్యంను రాశులుగా ఏర్పరుచుకున్నారు.ఇప్పటికే మండలంలో అనేకచోట్ల వరిపంట కోతలు, నూర్పిళ్ళు సగంపైగా పూర్తి అయ్యాయి. ఈఏడాది మండలంలో మొత్తం 2,582 ఎకరాల్లో వరిపంట సాగు నిర్వహించారు. ఇప్పటివరకు దాదాపు 1,480 ఎకరాల్లో వరి కోతలు పూర్తి అవడం జరిగింది. కృష్ణవరం, కొత్తూరు తదితర ప్రాంతాల్లో కోతలు చేపట్టిన వరి పనలు ఇంకా పొలాల్లో ఉండడంతో వాటిపై చిరుజల్లులు పడ్డాయి. వరి రైతులు నూర్పిళ్ళు చేసిన దాన్యంను తడవకుండా బరకాలు, టార్పారిన్లు రక్షణగా కప్పారు.

మెకానిక్ ఔదార్యం



బాబును నీళ్లతో శుభ్రం చేస్తున్న మెకానిక్ జావీద్

మోతుగూడెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భద్రాచలానికి చెందిన మెకానిక్ జావీద్ అనే వ్యక్తి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. రాజమండ్రి వైపు నుంచి చింతూరువైపు కారులో వస్తుండగా తులసిపాక గ్రామానికి సుమారు 1కిలోమీటరు దూరంలో ఒక బాబు కనిపించాడు. జావీద్‌వెంటనే కారు ఆపి బాబు దగ్గరకు వెళ్లి బాబుతో మాట్లాడే ప్రయత్నం చేయడంతో బాబుకు ఇంకా మాటలు రాకపోవడంతో ఏమి చెప్పలేకపోయాడు. బాబుకు చుట్టుప్రక్కల కుక్కలు ఉండటం గమనించి వెంటనే ఆ బాబును తన దగ్గరికి చేర్చుకున్నాడు. ఆ బాబు ఒంటి నిండా బురద మట్టి ఉండటంతో నీటితో శుభ్రపరిచి ఆ బాబును స్థానిక పోలీసులకు అప్పగిద్దామని కారులో తీసుకొస్తుండగా అప్పటికే తులసిపాక గ్రామంలో మహిళలు అందరూ కలిసి బాబును వెతుకుతున్నారు. వారిని గమనించిన జావిద్ వారి దగ్గరికి వెళ్లి అడగ్గా మహిళలు బాబు గురించి చెప్పారు. కారులో ఉన్న బాబును వారి దగ్గరికి తీసుకొచ్చి ఈ బాబేనా అని చూపించగా అవును అని మహిళలు తెలపడంతో దీంతో ఆ బాబును వారికి అప్పగించి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు.



ఆంజనేయ భక్తుల సందడి

మోతుగూడెం,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతంవద్ద ఆదివారం తణుకు నుంచి వచ్చిన ఆంజనేయ మాల ధరించిన భక్తులు కిటకిటలాడారు. పొల్లూరు జలపాతం అందాలను చూస్తూ కాసేపు అక్కడ స్వాములు సేద తీరారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

వీడని ముసురు

● రోజంతా వర్షం ● ఆందోళనలో రైతులు

● వేల ఎకరాల్లో నేలనంటిన వరిపంట



ప్రత్తిపాడు హైవేపై పడుతున్న వర్షం



కోటనందూరులో నేలనంటిన వరిపంట

తొండంగి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా ఉన్న ముసురు వాతావరణం ఆదివారం కూడా కొనసాగింది. ఫెంగల్ తుఫాను కారణంగా విడవకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ఇప్పటికే కోతలు పూర్తిచేసి పనలపై చేలున్న వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులకు పలుచోట్ల వరిచేలు నేలనంటాయి. ఇదే వాతావరణం కొనసాగితే తీవ్రంగా నష్టపోతామన్న రైతులు ఆందోళన చెందుతు న్నారు.

కోటనందూరు: తుఫాన్ ప్రభావంతో వరి పంట నేలనంటడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి కన్నెర్ర చేయడంతో పంట చేతికందే దశలో సుమారు 1500 ఎకరాల్లో వరి పంట నేలమట్టం కావడంతో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఈఏడాది పంట బాగుంది దిగుబడులు బాగావస్తాయి అనే సమయంలో తుఫాన్ ప్రభావం పడింది. దీనివలన పూర్తిగా గింజరాలిపోవడంతో పాటు కింద పడిపోయిందని రైతులు వాపోతున్నారు. మండలంలోని 17గ్రామాల్లో సుమారు 15వేల ఎకరాల్లో పంట పరిస్థితి ఇలాగే ఉంది. ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ప్రత్తిపాడులో భారీ వర్షం

ప్రత్తిపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ప్రత్తిపాడులో వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రంవరకు పలుమార్లు వర్షం కురిసింది. దీంతో మండలంలోని ఖరీఫ్ వరి కోతలు ముమ్మరం అయిన ఈ వర్షంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పనలపై ఉన్న వరి తడిసి ముద్దయింది. వర్షానికి కొన్ని చోట్ల వరి చేలునేలనంటాయి. రోజంతా వర్షం పడటంతో పౌర జీవనానికి అంతరాయం కలిగింది.



ఏలేశ్వరంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ప్రత్తిపాడులో ప్రదర్శన నిర్వహిస్తున్న సిబ్బంది

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

జగ్గంపేట, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా మండల కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు స్వరాజ్య అభ్యుదయ సేవా సమితి ఆదివారం ర్యాలీ నిర్వహించింది. రాజపూడి పీహెచ్‌సీ సిబ్బంది మాట్లాడుతూ హెచ్ఐవీ నివారణ, వ్యాపించకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజపూడి పీహెచ్ ఎస్.లక్ష్మీకాంతం, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, స్వరాజ్య అభ్యుదయ సేవాసమితి ప్రతినిధులు సత్యనారాయణ, సత్యవతి, శేషరత్నం, శివకృష్ణ, అనిల్, మణికుమారి, మేరీపీర్ ఎడ్యుకేటర్స్ పాల్గొన్నారు

ఏలేశ్వరం: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏలేశ్వరం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి నేతృత్వంలో ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. డిగ్రీ కళాశాల విద్యార్థులు బాలాజీచౌక్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్ మహమ్మారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బంగార్రాజు, సురేష్, రామారావు, సుప్ప, పాపారావు, విజయలక్ష్మీ, మణికుమార్ ఉన్నారు.

ప్రత్తిపాడు: ప్రపంచ ఎయిడ్స్ డే పురస్కరించుకుని ఆదివారం ప్రత్తిపాడు, రాచపల్లి గ్రామాల్లో ఎయిడ్స్ ర్యాలీలు నిర్వహించారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద సూపరింటెండెంట్ సౌమ్య ఆధ్వర్యంలో సిబ్బంది ఎయిడ్స్ ర్యాలీ నిర్వహించగా రాచపల్లిలో మండల వైద్యాధికారి పవన్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు బుగతా శివ,బి. మధుబాబు ర్యాలీలో పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం మన లక్ష్యం

గండేపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధి పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ రహిత సమాజంకోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ పోసిన బాబురావు, కుంచే రాజా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తలుపులమ్మ కరుణించమ్మ

● ఆలయానికి రూ.1.16లక్షల ఆదాయం



ప్రత్యేక అలంకరణలో తలుపులమ్మ అమ్మవారు

తునిరూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): తూర్పు కనుమల్లో మహిమలు విరజిల్లుతున్న తలుపులమ్మతల్లి లోవ క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేకువజామునేతరలివచ్చిన భక్తులతో ఆలయప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారికి వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఏర్పాటుచేసిన వసతి గదులు, ఆరుబయట వంటషెడ్‌లో వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలుచేశారు. ఆలయానికి భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా రూ.1.16లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.విశ్వనాథ్ రాజు తెలిపారు.

కోలాహలంగా కార్తీక వన సమారాధనలు



రాచపల్లి అడ్డురోడ్డు వద్ద ఉసిరి చెట్టుకు పూజలుచేస్తున్న భక్తులు

ప్రత్తిపాడు, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో చివరి ఆదివారం కావడంతో మండలంలో కార్తీక వనసమారాధనలు కోలాహలంగా నిర్వహించారు. రాచపల్లి అడ్డురోడ్డు మామిడి తోట సమీపంలో గొడే హరీష్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధనలు నిర్వహించారు. ప్రత్తిపాడు గోకవరపువీధి పరిసర ప్రాంత మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి ఉసిరిచెట్టుకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం గొడే హరీష్‌ను భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు పత్రి రమణ, గౌరీశంకర్, తదితరులు ఘనంగా సన్మానించారు. ధర్మవరంలోని రాజగోపాలస్వామి ఆలయాన్ని వైసీపీనేత ముదునూరి మురళీ కృష్ణంరాజు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అరుణాచలేశ్వరస్వామి, రమణ సేవాశ్రమం, శాంతి ఆశ్రమం, ఎరకంపాలెం ఆశ్రమాలను విద్యార్థులు పెద్దఎత్తున సందర్శించి కార్తీక వన సమారాధన వేడుకల్లో పాల్గొన్నారు.

యాదవుల సంఘం ఆధ్వర్యంలో..

జగ్గంపేట: గోకవరం రోడ్డు వాసుదేవనగర్‌లో జగ్గంపేట నియోజకవర్గంలోని యాదవులు కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు.ఉదయంనుంచి జగ్గంపేట నియోజకవర్గంలో గల యాదవులు కుటుంబ సభ్యులతో కలిసి వన భోజనాలు చేశారు. కార్యక్రమానికి టీటీడీ సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విశిష్టఅతిథిగా జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, వైసీపీ యువ నాయకుడు తోట ఆంజీ హాజరయ్యారు. ఎమ్మెల్యేను యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని యాదవ కులస్థులందరూ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ వన సమారాధన నిర్వహించుకోవడం ఆనం దంగా ఉందన్నారు.యాదవ కులస్థులకు ఎకరం స్థలంలో సామాజిక భవనం నిర్మిస్తానని, విద్యా, వైద్యం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, యాదవ సంఘం ఆహ్వానకమిటీ అడపా భరత్ బాబు, ఒ మ్మి రఘురాం, మోరుకుర్తిరాజు, వైబోగుల కొండబాబు యాదవ్ పాల్గొన్నారు.



వన సమారాధనలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను సత్కరిస్తున్న నాయకులు

ప్రభుత్వ విప్ దివ్యకు పలువురి కృతజ్ఞతలు



ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే దివ్యకు కృతజ్ఞతలు తెలుపుతున్న మత్స్యకార నాయకులు

తునిరూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్యకు తేటగుంట క్యాంపు కార్యాలయంలో తుని ప్రజల నుంచి కృతజ్ఞతలు వెల్లువెత్తాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో గ్రామస్థాయి సమస్యలను అసెంబ్లీలో వినిపించి వాటి పరిష్కారమార్గం వైపుగా చొరవచూపడంతో ఇటు మత్స్యకార నాయకులతోపాటుగా తుని, కోటనందూరుకు చెందిన రైతు సంఘాల నాయకులు యనమల దివ్యను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. చొక్కా కాశీ, చొక్కా మహంకాళి, సూరాడ రాంబాబు, ముత్తి రమణ, కాశీరాజు తదితరులు ఉన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం

ఎటపాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎటపాక మండలం, లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని లింగాలపల్లి గ్రామానికి చెందిన బి.బాబు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. అతని దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం జామాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5 వేల ఆర్థిక సాయంను అంధజేశారు. లక్ష్మీపురం స్థానిక టీడీపీ నాయకులు కణితి మధు బాధిత కుటుంబానికి నగదును అందించారు. వి.వెంకన్న, బొప్పనిబాబు, టి. వెంకన్న, నరేష్, సురేందర్ మొల సతీష్ పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభను విజయవంతం చేయండి

ఏలేశ్వరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జనవరి 5వ తేదీన విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో కొండలరావు మాట్లాడుతూ హిందూ ఆలయాలను ప్రభుత్వ ఆధీనం నుంచి తప్పించి ఉత్తమ ధార్మిక సంస్థలకు అప్పగించాలన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ బహిరంగ సభ కరప్రతాలు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో కొల్లా శ్రీనివాస్, తోట మహేశ్వరరావు, అలమండ దుర్గా వెంకట ప్రసాద్, కటకం కిరీటి, రాతికింద కృష్ణారావు, ఆకుల హరిబాబు, తోట వీర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌కు బెస్ట్ సర్వీస్ అవార్డు

తొండంగి,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి):ఏవీ నగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేస్తున్న అలేఖ్యకు బెస్ట్ సర్వీస్ అవార్డు లభించింది. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం కాకినాడలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాయక్ చేతుల మీ దుగా అవార్డు అందుకున్నారు. ఆమెకు అవా ర్డు రావడంపట్ల పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రవి కుమార్, భారతిలు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన అడ్వకేట్ నరేష్



ఎమ్మెల్యేను కలిసిన గవర్నమెంట్ ప్లీడర్ కందుల నరేష్

జగ్గంపేట, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీటీడీ సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతులనెహ్రూను పెద్దాపురం సెవెన్త్ జిల్లా కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నూతనగా బాధ్యతలు చేపట్టిన కందుల నరేష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నరేష్‌కుమార్ మాట్లాడుతూ జగ్గంపేట ఎమ్మెల్యే ఆశీస్సులతో పెద్దాపురం సెవెన్త్ జిల్లా కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ అసిస్టెంట్ అడ్వకేట్‌గా బాధ్యతలు చేపట్టి మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశానన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీ ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, వేములకొండ జోగారావు, బుర్రి సత్తిబాబు, శాస్త్రి పాల్గొన్నారు.

ప్రజా హక్కుల సభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రత్తిపాడు, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): విజయవాడ జింకానా గ్రౌండ్ లో ఈనెల 4న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నిర్వహిస్తున్న ప్రజాహక్కుల సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు కోరారు. స్థానిక లిబరేషన్ పార్టీ కార్యాలయంలో ఆదివారం బంగార్రాజు, పార్టీ నాయకులు ప్రజాహక్కుల సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో పూర్తి గా విఫలమైందన్నారు. ఈ సభకు ముఖ్యాతిథిగా లిబరేషన్ జాతీయ కార్యదర్శి దిపాంకర్ భట్టాచార్య, పొలిట్ బ్యూరో సభ్యులు స్వదేశ్ భట్టాచార్య, ఆంధ్ర, తెలంగాణా ఇన్‌చార్జ్లు వి.శంకర్, ఎస్.మూర్తి తదితరులు హాజరుకానున్నారని బంగార్రాజు తెలిపారు. కార్యక్రమంలో లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు పాల్గొన్నారు.

ఘనంగా ప్రత్యంగిరి హోమం



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో ఆదివారం అమావాస్య పురస్కరించుకుని ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు అర్చకులు వి.గురుదత్తాత్రేయశర్మ యాగకర్తగా వ్యవహరించగా రుత్విక్‌లు గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం ప్రత్యంగిరి దేవతను ఆవాహన గావించి అమ్మవారికి జపములు, పారాయణలు నిర్వహించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. 78 జంటలు ప్రత్యంగిర హోమం నిర్వహించుకున్నారు. సూపరింటెండెంట్ ఐ.వి.రామారావు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతే లక్ష్యం

ఏలేశ్వరం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యు న్నతే ప్రభుత్వ లక్ష్యమని కౌన్సిలర్ అలమండ చలమయ్య అన్నారు. ఆదివారం పట్టణంలో దాకమూరి మెమోరియల్ ఛారిటబుల్ కమ్యూనిటీ హాల్‌లో రజ క సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చలమయ్య మాట్లాడుతూ బలహీనవర్గాల వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నా యకులు, తదితరులు ఉన్నారు.